విత్తన శుద్ధి.. దిగుబడి వృద్ధి

- సస్యరక్షణ కన్న.. ముందు జాగ్రత్తే మిన్న
- పంటల సాగులో రైతులకు ఏడీఏ సుధారాణి సలహాలు, సూచనలు



విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు(ఫైల్)



మహేశ్వరం: విత్తన శుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చని మహేశ్వరం సహాయ వ్యవసాయ సంచాలకులు సుధారాణి అన్నారు. నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసిన తొలి దశలో నేల, విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్ల, రసం పీల్చే పురుగులను నియంత్రించాలంటే.. శుద్ధి ప్రక్రియ తప్పనిసరని పేర్కొన్నారు. చీడ పీడలు వ్యాప్తి చెందిన తర్వాత సస్యరక్షణ పద్ధతులు పాటించడం కంటే.. వాటిని ముందుగానే శుద్ధి ప్రక్రియతో అదుపు చేసుకోవాలని సూచించారు. దీని వలన పంట నాణ్యత పెరగడంతో పాటు అధిక దిగుబడి వస్తుంది. ఆశించిన ఆదాయం పొందవచ్చునని పేర్కొన్నారు. పంటల సాగు, చీడపీడల తెగుళ్ల నివారణ గురించి రైతులకు సూచనలు, సలహాలు ఏడీఏ మాటల్లోనే..

శుద్ధి ప్రాముఖ్యత

సేంద్రియ వ్యవసాయంలో విత్తన శుద్ధి ముఖ్యం. ఈ పద్ధతితో సంక్రమించే తెగుళ్ల, వ్యాధులను నివారించవచ్చు. ఆరోగ్యకరమైన విత్తనాలు వేగంగా మొలకెత్తుతాయి. మొక్కలు బలంగా పెరిగి అధిక దిగుబడి ఇస్తాయి. మొలక శక్తిని పెంచుతుంది. మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషకాలు అందిస్తాయి. పంట నష్టాన్ని నివారించవచ్చు, తద్వారా రైతుకు పెట్టుబడి తగ్గుతుంది.

అనేక లాభాలు

పంట సాగు చేస్తున్న రైతులు విత్తన శుద్ధి క్రమం తప్పకుండా చేయాలి. శుద్ధితో మొలక శాతం పెరిగి సాంద్రత సిఫార్సు మేరకు ఉంటుంది. తొలి దశలో ఆశించే పురుగులు, తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుతుంది. దీంతో మొక్క ఏపుగా పెరగడానికి అవకాశం ఉంటుంది. చీడ పీడల ఉధృతిని తగ్గించి, తర్వాత దశలో ఆవహించి రసం పీల్చు పురుగులు, వైరస్ తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవచ్చు. రైజోబియం వలన నత్రజని స్థిరీకరణ జరుగుతుంది. అంతేకాక వాతావరణ కాలుష్యం తగ్గి, మిత్ర పురుగులు రక్షించబడుతాయి.

- నేల: నేల శుద్ధికి 100 కిలోల పశువుల ఎరువు. 10 కిలోల వేప పిండి. 2 కిలోల ట్రై కోడెర్మా విరిడిని తీసుకుని నీడలో బాగా కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని వారం పాటూ ఉదయం, సాయంత్రం నీటితో తడుపుతూ మాగబెట్టాలి. పొలంలో తేమ ఉన్నప్పుడు ఒక ఎకరం విస్తీర్ణంలో చల్లుకోవాలి.
- వరి: మెట్ట వరి సాగుకు కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్ అనే మందును పట్టించి, ఆరబెట్టి విత్తుకోవాలి. నారుమడి పద్ధతిలో సాగు చేయాలనుకుంటే రైతులు కిలో విత్తనానికి 1 గ్రాము కార్బండిజమ్ మందును కలిపి 24 గంటలు నీళ్లలో నానబెట్టాలి. అనంతరం మండెకట్టి ముక్కు పగిలిన విత్తనాన్ని విత్తుకోవాలి.
- పత్తి: బ్యాక్టీరియా వలన నల్లమచ్చ ఆశించే ప్రాంతాల్లో లీటర్ నీటిలో 100 మిల్లీ గ్రాముల వైసనస్ లేదా ప్లాంటామైసిన్, గ్రామ్ లైటాన్స్ కలిపిన ద్రావణంలో శుద్ధి చేసిన విత్తనాలను 6–8 గంటలు నానబెట్టాలి. ఆ తర్వాత ఆరబెట్టుకొని, విత్తుకుంటే ప్రయోజనం.
- కంది: కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్ పట్టించాలి. ఆ తర్వాత 10 గ్రాముల ట్రై కోడెర్మా విరిడిని పట్టించాలి. అరగంట తర్వాత 200–400 గ్రాముల రైజోబియం కలుపుకొని విత్తుకోవాలి.
- జొన్న: కిలో జొన్న విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్, 4 గ్రాముల థయోమిథాక్సమ్ పట్టించాలి. ఆ తరువాత అరగంట నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.

శుద్ధి రకాలు

పొడి విత్తనాలను శిలీంద్రనాశకాలు, పురుగు మందులు లేదా ఇతర రసాయనాలతో శుద్ధి చేయాలి. తడి విత్తనాలను నీటిలో నానబెట్టి, అపై రసాయనాలతో శుద్ధి చేయడం. శిలీంద్రాలు లేదా బ్యాక్టీరియా వంటి జీవసంబంధ ఏజెంట్లతో విత్తనాలను శుద్ధి చేయడం. పొడి విత్తనాలను పొడిగా ఉంచి, శిలీంద్రనాశకాలను వాటిపై చల్లడం. తడి విత్తనాలను నీటిలో నానబెట్టి, ఆపై



విత్తన శుద్ధి

శిలీంద్రనాశక ద్రావణంలో ముంచాలి. విత్తన పూత.. విత్తనాలను ఒక పొరలాగా రసాయనాలు పూయాలి.

నిజమైన దేశభక్తుడు శ్యాంప్రసాద్

బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కందుకూరు: అఖండ భారతావని నినాదాన్ని ఎలుగెత్తి చాటిన నిజమైన దేశభక్తుడు జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బస్వ పాపయ్యగౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన పార్టీ జెండా ఎగిరేలా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తేరటి లక్ష్మణ్‌ముదిరాజ్, జిట్టా రాజేందర్‌రెడ్డి, పల్లె కృష్ణగౌడ్, సాధ మల్లారెడ్డి, టి.జగదీశ్వర్‌రెడ్డి, పి.భిక్షపతి, డి.సత్తిరెడ్డి, బి.మల్లేష్, జి.ప్రభాకర్, ఎన్.నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్.వెంకటేష్, ఎస్.భూమిరెడ్డి, రవీందర్‌ముదిరాజ్, రఘునందన్, నర్సిహా, డి.అనిల్, రామకృష్ణ, గణేష్, మల్లేష్, చెన్నయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో మొక్కలు నాటుతున్న నాయకులు

మీర్‌పేటలో..

మీర్‌పేట: దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రాణాలను అర్పించిన నిజమైన దేశభక్తుడు డా.శ్యాంప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా సోమవారం మీర్‌పేట, జిల్లెలగూడ ప్రాంతాల్లో బీజేపీ శ్రేణులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి, మీర్‌పేట–1, 2 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేశ్‌ముదిరాజ్, మాజీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, నాయకులు కీసర గోవర్ధన్‌రెడ్డి, సోమేశ్వర్, గాజుల మధు, కీసర హరినాథ్‌రెడ్డి, భీంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి

బడంగ్‌పేట్: దేశ సమగ్రత కోసం పోరాటం చేసిన మహోన్నత దేశ భక్తుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. సోమవారం బడంగ్‌పేట మున్సిపల్ కార్యాలయం ఎదుట శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ 1,2 అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, మహిళా మోర్చా నాయకురాళ్లు తదితరులు ఉన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ చూపిన బాటలో..

మహేశ్వరం: శ్యాంప్రసాద్ ముఖర్జీ మహోన్నతమైన దేశ భక్తుడని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని పెండ్యాల, డబిల్‌గూడ గ్రామాల్లో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్యగౌడ్, మండల అధ్యక్షుడు టి.యాదీశ్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, నర్సింహ, సామయ్య, బాలకృష్ణ, శేఖర్, కుమార్‌గౌడ్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, మోహన్, దర్శన్ పలువురు పాల్గొన్నారు.



మహేశ్వరం: పెండ్యాలలో మొక్కలు నాటుతున్న నాయకులు



మీర్‌పేట: మీర్‌పేటలో..

క్లుప్తంగా

బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం



విద్యార్థుల సన్మానంలో ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఇంటర్, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన కమిటీల్లో స్థానం పొందిన వారిని అభినందించారు. సేవా కార్యక్రమాలు చేపడుతున్న బ్రాహ్మణ సంఘాలను ప్రశంసించారు. బడంగ్‌పేట్ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు, కోశాధికారి బల్లమూడి రాంబాబు, శ్రీనివాస్, జగన్మోహన్, ఒక్కలంక శ్రీనివాస్, పంతంగి మాధవి, మహిళా అధ్యక్షురాలు అకెళ్ల అనురాధ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న పుర అధికారులు

తుక్కుగూడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యక్రమం మున్సిపాలిటీ వ్యాప్తంగా కొనసాగుతోంది. సోమవారం 22వ రోజు ఈ కార్యక్రమాన్ని పుర కేంద్రంలోని 13వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో వీధులు, రోడ్లను శుభ్రం చేశారు. డ్రైనేజీ, నాలాలను క్లీన్ చేశారు. పరిసరాల–పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాణి, ఆర్ఐ మల్లేశ్, పుర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ ఫర్హత్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పోస్టాఫీసు, విశాలాంధ్ర ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, 11కేవీ శారదానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, 11కేవీ హరిపురికాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులతో హెచ్‌ఎం భిక్షపతి, ఎంఈఓ నర్సింహ, ఉపాధ్యాయుడు

కందుకూరు: మండల పరిధిలోని దాసర్లపల్లి తండా ప్రాథమిక పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి, ఉపాధ్యాయుడు మధూకర్ తమ సొంత డబ్బుతో విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు, స్టేషనరీతో పాటు పాఠశాలకు టీవీని అందజేశారు. సోమవారం ఎంఈఓ నర్సింహ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం అంజయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కవిత, పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఆరు ఫిర్యాదులు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయం పరిధిలోని ఐదు సర్కిళ్లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆరు ఫిర్యాదులు వచ్చాయి. కాప్రా సర్కిల్ ఇంజినీరింగ్ విభాగంపై–2, ఉప్పల్ సర్కిల్‌లో టాక్స్‌పై –1, హయత్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగంపై–2, ఎల్‌బీనగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్‌పై -1 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

సీపీఐ ఐఎస్‌సదన్ కార్యదర్శిగా షేక్ మహమూద్

సైదాబాద్: సీపీఐ ఐఎస్‌సదన్ డివిజన్ కార్యదర్శిగా షేక్ మహమూద్ ఎన్నికయ్యారు. డివిజన్ పరిధి సింగరేణి కాలనీలోని గిరిజన సమాఖ్య భవనంలో జరిగిన పార్టీ డివిజన్ 4వ మహాసభలో ఆయనను సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహమూద్ మాట్లాడుతూ.. నిరుపేదలు బలహీన వర్గాల సమస్యలు పరిష్కరించడానికి సీపీఐ ముందుంటుందన్నారు.



కందుకూరు: పీహెచ్‌సీలో వైద్యుల కోసం నిరీక్షిస్తున్న రోగులు



మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిలో మందులు తీసుకుంటున్న రోగులు

వేధిస్తున్న వైద్యుల కొరత

- సమయ పాలన పాటించని డాక్టర్లు
- ఇబ్బంది పడుతున్న రోగులు
- 'సాక్షి'పరిశీలనలో వెలుగులోకి

మహేశ్వరం: మహేశ్వరం ప్రభుత్వ 30 పడకల ఆస్పత్రిలో రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఆస్పతిలో 16 మంది వైద్యులకుగాను ప్రస్తుతం 9 మంది విధులు నిర్వర్తిస్తుండగా 7 వైద్యుల పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రతీ రోజు సుమారు 250 నుంచి 350 వరకు రోగులు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసుకుంటున్నారు. రోగులకు సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయి. గర్భిణులకు ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు నిర్వహిస్తున్నారు. అందులో కేవలం ఐదు బెడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కొత్తగా డయాలసిస్ చేసుకునేవారికి అవకాశం లేకుండా పోతోంది. దీంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. డయాలసిస్ కేంద్రంలో మరో ఐదు బెడ్లు పెంచాలని ఉన్నతాధికారులకు నివేదించామని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అమీర్ సిద్దిఖీ తెలిపారు.

11 గంటల వరకు డాక్టర్ రాలేదు

కందుకూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విధులకు ఆలస్యంగా హాజరయ్యారు. తొలుత ఏఎన్ఎంతో పాటు ఇతర సిబ్బంది రాగా.. వైద్యురాలు 10.58 గంటల వరకు రాలేదు. ఫార్మాసిస్టు లేటుగానే వచ్చాడు. అప్పటి వరకు నిరీక్షించిన రోగులకు.. ఏఎన్ఎం దిక్కయింది. పేషంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. పీహెచ్‌సీలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ ఇద్దరు వైద్యులు వైద్య సేవలు అందించాల్సి ఉండగా.. ఒకరు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఆమె సమయ పాలన పాటించలేదు.

మన్సాన్‌పల్లిలో కాంగ్రెస్ బలంగా ఉంది

సీనియర్ నాయకుడు మల్లేశ్‌యాదవ్

మహేశ్వరం: మన్సాన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లో ఎవరు చేరలేదని, కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని సీనియర్ నాయకులు వట్టెల మల్లేశ్‌యాదవ్, మర్యాద మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వత్తుల రఘుపతి కాంప్లెక్స్‌లో మన్సాన్‌పల్లి గ్రామ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన్సాన్‌పల్లి గ్రామం అంటే కాంగ్రెస్‌కు కంచుకోట అని గతంలో మంత్రిగా ఉన్నప్పుడు సబితారెడ్డి ప్రశంసించారని గుర్తు చేశారు. ఆమె కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి వెళ్లగానే కాంగ్రెస్ పార్టీ బలహీనమైందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మన్సాన్‌పల్లిలో అర్హత కలిగిన వారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ జరిగిందన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

సబితారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేక కాంగ్రెస్ సంక్షేమ పథకాలపై విమర్శలు చేయడం సరైందికాదన్నారు. త్వరలో జరిగే ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో మన్సాన్‌పల్లిలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కంది రమేష్, నర్సింహయాదవ్, పబ్బ రాఘవేందర్‌గౌడ్, ఏర్పుల శ్రీశైలం, రమేష్, పాండు యాదవ్,మల్లేష్ ముదిరాజ్ పలువురు పాల్గొన్నారు.

కార్యకర్తలు ప్రభుత్వానికి వారధిగా ఉండాలి

సైదాబాద్: కాంగ్రెస్ కార్యకర్తలు తెలంగాణ ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా ఉండాలని మలక్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ షేక్ అక్బర్ సూచించారు. మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్‌లో పార్టీ సీనియర్ నాయకుడు ఎ.మదన్‌బాబు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన టీపీసీసీ పరిశీలకులు సుబ్రహ్మణ్యం, సురేష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్బర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతికి ప్రవేశ పెడుతున్న పథకాలు అర్హులకు అందేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు సన్నద్ధంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో బొల్లు కిషన్, బాలకృష్ణ యాదవ్, గంట్ల కృష్ణ, రామారావు, శ్రీకాంత్‌చ రవీందర్, అనూప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షేక్ అక్బర్

సెల్‌టవర్ అవకతవకలపై విచారణ జరపాలి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని పహాడీషరీఫ్ గ్రామంలో సెల్‌ఫోన్ టవర్ అనుమతి కోసం చేసుకున్న దరఖాస్తును కనీసం పరిశీలించకుండా ఇన్‌వార్డు సిబ్బంది స్టాంప్‌లు వేయడం ఉన్న మతలబు తేల్చాలని మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫొద్దీన్ హమేద్ డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను మేనేజర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరించడంతోనే పరిస్థితులు అధ్వాన్నంగా మారుతున్నాయన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ వరంగల్‌లో అంటూ అక్రమంగా స్టాంప్‌లు వేస్తున్నా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ప్రాంతంలోని క్రాంతినగర్‌లో నిర్మాణ దశలో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం ఆలయ ఆలయ కమిటీ సభ్యుల కోరిక మేరకు ఆలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.

కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

చాదర్‌ఘాట్: హైదరాబాద్ నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరిచందనను తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. సోమవారం ఆమెను కార్యాలయంలో కలిసిన ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీవాటి శ్రీనాథ్, డాక్టర్ ఎస్.విజయ్‌భాస్కర్ కలిసి మెమొంటో అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మలక్‌పేట: తెలంగాణ వీరభద్రీయ (వీరముష్టి) సంఘం కేంద్ర కమిటీ సర్వసభ్య సమావేశం సోమవారం కేంద్ర కమిటీ అధ్యక్షుడు కాటపల్లి వీరస్వామి అధ్యక్షతన మూసారంబాగ్‌లోని కేంద్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షుడు కాటపల్లి రాజేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకాగా.. పొన్నాల నరహరి ఎన్నికల చైర్మన్‌గా వ్యవహరించారు. జిల్లా, స్థానిక సంఘాల ప్రతినిధులతో కూడిన ఎన్నికల కమిటీ సమన్వయంతో నూతన కేంద్ర సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కొండయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా భిక్షపతి, పోచయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి రవికుమార్ ఎన్నికయ్యారు.

రైతులకు 'భరోసా' ఇవ్వాలి

- పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్
- లేదంటే బీఆర్‌ఎస్ తరఫున ఆందోళన చేస్తామని హెచ్చరిక

మహేశ్వరం: మండలంలోని రైతులకు ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 19,817 ఎకరాలకు సంబంధించి 13,470 మంది అన్నదాతలు రైతుభరోసా కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. అందరికీ సాగు సాయం అందించాల్సి ఉన్నా ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకోకపోవడం అన్యాయని మండిపడ్డారు. రైతులు వరి నాట్లు, కరిగట్లు చేసుకొని పంటల సాగుకు సిద్ధమవుతున్న సమయంలో కూడా డబ్బులు అందించకపోవడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా రైతులకు భరోసా ఇవ్వకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పి.అంబయ్య యాదవ్, డైరెక్టర్లు పోల్కం బాలయ్య, కడమోని ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, శివ గౌడ్, నయూమ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాండుయాదవ్, వెంకటేశ్వరరెడ్డి

దశలవారీగా అభివృద్ధి పనులు



పనుల శంకుస్థాపనలో కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: దశల వారీగా కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాసపురం కాలనీలో రూ. 54 లక్షలతో రోడ్డు నెం. 6, 8, 9 లో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పలు కాలనీలలో అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ నాయకులు మధుగౌడ్, లక్ష్మీనారాయణ, వేణు, చిన్నయాదవ్, ఇతర కాలనీల నాయకులు నవీన్, హరీందర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, సాయికిరణ్‌గౌడ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంపై చర్యలు తప్పవు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: పారిశుద్ధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని కమలానగర్, ద్వారకామయినగర్ కాలనీలలో పారిశుద్ధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, కాలనీవాసులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో సోమవారం ఆయన కాలనీలో పర్యటించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీల నాయకులు టీ.వీ.రావు, సుబ్బారావు, శశిధర్, సురేందర్, లక్ష్మణస్వామి, ప్రవీణ్, సురేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

సైదాబాద్: మాదన్నపేట మార్కెట్‌లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ సోమవారం జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదన్నపేట మార్కెట్‌లో పారిశుద్ధ్య నిర్వహణ లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మార్కెట్‌లో శానిటేషన్ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు.



వినతి పత్రం ఇస్తున్న శ్రీనివాస్